27-12Pg1fA:Layout 1 27/12/23 12:38 AM Page 1

ఆదివారం
గత వారంలోని పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
అనంతపురం fb.com/vaartha
PUBLISHED FROM ANANTAPUR, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
27-12-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 327, పేజీలు : 08+4 వెల : 6.50

బిసి కులాలకు ప్రభుత్వం పెద్దపీట: మంత్రి పెద్ది రెడ్డి

'అయోధ్య' వేడుకలకు వామపక్షాలు దూరం

# ఆటలతోనే అందరికి ఆరోగ్యం

**అందుకే క్రీడలు, వ్యాయామాన్ని ప్రోత్సహిస్తున్నాం**

**'ఆడుదాం ఆంధ్ర' మెగా ఈవెంట్‌ను ప్రారంభించిన సిఎం జగన్**

**గుంటూరు జిల్లా నల్లపాడులో ఉత్సాహాభరితంగా సాగిన క్రీడలు**

**దశలవారీగా అన్ని ప్రాంతాలలో ఈ కార్యక్రమం: సిఎం**



మంగళవారం క్రీడాజ్యోతిని ప్రదర్శిస్తున్న సిఎం జగన్, మంత్రి రోజ



**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం క్రీడలు, వ్యాయమాన్ని ప్రోత్సహిస్తుందని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి స్పష్టం చేసారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట దేశంలో అతి పెద్ద ఆటలు,క్రీడల పోటీ( మెగా టోర్నమెంట్)నిర్వహిస్తున్నామన్నారు, ఈ కార్యక్రమం ద్వారా రెండు ప్రధాన ఉద్దేశాలను అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ప్రతి ఊర్లోను వ్యాయమం, క్రీడలు ప్రతి మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు.ఆరోగ్యం సరిగ్గా ఉండాలంటే మన జీవితాల్లో క్రీడల అవసరం ఎంతో ఉం దన్నారు.క్రమం తప్పకుండా వ్యాయమం చేస్తే రక్తపోటు, మధు మేహం నియంత్రణలో ఉంటాయన్నారు.మన రాష్ట్రంలోనే అతిపెద్ద రాష్ట్ర వ్యాప్త క్రీడా టోర్నమెంట్‌గా ఇది నిలుస్తోందన్నారు. క్షేత్ర స్థాయి నుంచి యువతలో నిభిడికృతమైన క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ఏర్పాటు ≫2



విజయవాడలో మంగళవారం ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

## ప్రభుత్వంతో అంగన్‌వాడీల చర్చలు విఫలం 2లో

**ఆందోళన కొనసాగించాలని నిర్ణయం, సంక్రాంతి తరువాత మళ్లీ చర్చలు!, నేడు ఎమ్మెల్యే ఇళ్లు ముట్టడి**





## పిసిసి చీఫ్‌గా షర్మిల?

**జనవరి 1న ప్రకటించే అవకాశం**

**వైఎస్సార్‌టిపి విలీనంపై కూడా అదే రోజు ప్రకటన**

**నేడు సోనియా, రాహుల్, ఖర్గేతో రాష్ట్ర కాంగ్రెస్ నేతల భేటీ**

**హైదరాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలను నియ మించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే తెలం గాణలో పాగావేసిన కాంగ్రెస్, ఇప్పుడు ఏపిపై దృష్టిసా రించింది. అందులో భాగంగానే ఏపిలో పరిస్థితులపై దృష్టిసారించింది. తన ఉనికిని కాపాడుకోవడంతో పాటు సత్తాచాటాలని ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అంతేకాకుండా వచ్చే లోకసభ ఎన్నికల్లో సత్తాచాటడమే లక్ష్యంగా వ్యూహరచన చేస్తుంది. దక్షిణ భారతదేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ మినహాయించి ప్రత్యక్షంగానో, పరో క్షంగానే కాంగ్రెస్‌కు మద్దతు ఉంది. కర్నాటక, తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. కేరళ, తమిళనాడు లో ఇండియా కూటమికి సంబంధించి పార్టీలు ఉన్నాయి. ఏపిలోనే పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. రాష్ట్ర విభజన ముందు హస్తం హవా కొనసాగగ, ప్రస్తుతం దారుణంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో కొంత మేరకు మార్పు తీసుకుని వచ్చేందుకు, వైఎస్ వారసురాలిగా షర్మిలకు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే జాతీయ స్థాయిలో పలు సంస్థాగతంగా మార్పు తీసు కుని రాగా, ఇటీవల ఇంచార్జ్‌లను మార్చారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ఇంచార్జ్‌గా మణికంఠాకూర్‌ను నియమించారు. తాజాగా షర్మిలను ఏపి అధ్యక్షురాలుగా నియమించి ఏపిలో అధికారం హస్తగతం చేసుకోవాలని చూస్తుంది. కాగా బుధవారం ఏపి కాంగ్రెస్ నేతలతో ఏఐసిసి సమావేశం నిర్వహించనుంది. సోనియాగాంధీ, ఏఐసిసి చీఫ్ మల్లిఖార్జున ఖర్గేతో పాటు రాహుల్‌గాంధీ, కెసి వేణుగోపాల్, ఏపికి సంబంధించి పిసిసి చీఫ్ రుద్ర రాజు, కొత్త ఇంచార్జ్ మణికం ఠాకూర్‌తో పాటు పలు వురు నేతలో సమావేశం కానున్నారు. వచ్చే ఎన్నికలపై చర్చించనున్నారు. అయితే ఏపిలో నేతలతో చర్చించి, ఆ తరువాత షర్మిల విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. వైఎస్ వారసురాలిగా షర్మిలను వాడుకో వాలని కాంగ్రెస్ భావిస్తుంది. అయితే షర్మిల మాత్రమే తెలంగాణవైపు మొగ్గ చూపుతుంది. అంతేకాకుండా వైఎస్సార్ తెలంగాణ పార్టీ విలీన ప్రకటన వెలువడనుంది. కొత్త సంవత్సరం రోజునే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయంపై ఇప్పటికే షర్మిలతో చర్చించినట్లు తెలిసింది. విలీన, అధికారికంగా ప్రకటనలు వెలువడటమే మిగిలి ఉంది.

**షర్మిల ఏపి కాంగ్రెస్‌లోకి వస్తే స్వాగతిస్తాం: అధ్యక్షులు రుద్రరాజు**

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏపి కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించబోతున్నారన్న వార్త ఏపిలో హల్‌చల్ సృష్టిస్తుంది. ఈ నేపథ్యంలో ఏపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు స్పందించారు. షర్మిల ఏపి కాంగ్రెస్‌లోకి వస్తే ఆహ్వానిస్తామన్నారు. పార్టీ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము శిరసావహిస్తామన్నారు.

## ఎన్నికల బదలీలపై ఇసి ఆదేశం

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీకి కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికా రుల బదిలీలపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు ఇచ్చింది.ఏపీతో పాటు 2024లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిస్సా రాష్ట్రాలకు ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది.ఇటీవల కేంద్ర ఎన్నికల కమీషన్ రాష్ట్రంలో పర్యటించి, స్థానిక అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమీషన్ అధికారులతో,జిల్లా కలెక్టర్లు,ఇతర సంబంధిత ఉన్నతాధికారులతో కీలక చర్చలు జరిపింది. ఎన్నికల నిర్వహణ సన్నద్ధం కావాలని సూచిం చింది.ఇదే క్రమంలో అధికారుల బదిలీలకు సంబంధించి కీలకాదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే మూడేళ్లకు పైగా ఒకే చోట పనిచేసిన అధికారులను వెంటనే బదిలీచేయాలని ఈసీ పేర్కొంది. సొంతజిల్లాల అధికారులను కూడా వేరే జిల్లాలకు బదిలీ చేయాలని స్పష్టం చేసింది. పోలీసు అధికారులతో సహా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందిన సీఈసీ పేర్కొంది. ఏపీ అసెంబ్లీ గడువు జూన్ 16తో ముగుస్తుందని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో ఆ దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.


ఎన్నారై యశస్వి పాస్‌పోర్టును విడుదల చేయండి 2లో



మంగళవారం సమస్యల పరిష్కారం కోసం విధులు బహిష్కరించి ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

## పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు,ఇంజినీరింగ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సిబ్బంది మంగళవారం నిరవధిక సమ్మెను ప్రారంభించారు.వారు విధులను బహిష్కరించి ఆయా పుర,నగరపాలక సంస్థల పరిధిలో జాతీయరహదారులపై బైఠాయింపులు, కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్ అమలు చేయాలంటూ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపును ఇచ్చారు.రాష్ట్ర వ్యాప్తం గా 50వేలమంది సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రోడ్లెక్కారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీతం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేసారు.మంగళగిరిలో బలవంతంగా చెత్తను తరలించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా కార్మికులు అడు కున్నారు.ట్రాక్టర్‌లోని చెత్తనురోడ్డుపై పడేసి నిరసన తెలిపారు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు జగన్ తమకు ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం ఇస్తామని ఆయనకు ఓట్లు వేసి గెలిపించినట్లు పారిశుద్ధ్య కార్మికసంఘం(సిఐటియు) నేతలు వ్యాఖ్యానించారు. సీఎం జగన్ తమకిచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని వారు వ్యా ఖ్యానించారు.పురపాలక,నగరపాలక సంస్థల్లో సమీప గ్రామాలను విలీనం చేసారు.అయితే అందుకు తగినట్లు కార్మికుల సంఖ్యను పెంచాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం ≫2



వార్త

లక్షలాది ప్రజల జీవితాలను దుర్భర దారిద్ర్యానికి గురిచేసి, నాశనం చేసే అస్తవ్యస్త రాజకీయాలు ప్రమాదకరం.

-గోథే

# రాక్షసక్రీడకు అంతంలేదా?

ఎన్ని చట్టాలు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎందరు నేతలు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక, వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇంతగా కొనసాగుతున్నా పాలకులు ర్యాగింగ్ కారకులైన వారిపై నిర్దిష్టమైన, పటిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు ఆందోళనకు దిగి ధర్నాలు, నిరసనలు చేయడంతో చర్యలు తీసుకున్నా ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ఉపసంహరించిన సంఘటనలు కోకొల్లలు. చాలా స్పష్టమైన సాక్ష్యాలతో వెలుగు చూసినప్పుడు కూడా వాటిని న్యాయస్థానం ముందుపెట్టి చట్టప్రకారం శిక్షలు వేయించడంలో అధికారులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ర్యాగింగ్ భూతాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి పారద్రోలేందుకు 1997లో తీసుకువచ్చిన చట్టం నేటికీ కాగితాల్లోనే పరిమితమవుతున్నదేమోననిపిస్తున్నది. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి వీటి కారణంగా గతంలో నాగార్జున యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఒక విద్యార్థిని బలవంతపు మరణానికి పాల్పడింది. ఈసంఘటన బయటపడకుండా చేయగలిగినదంతా కొందరు అధికారులు చేయగలిగారు. కానీ తోటి విద్యార్థులు స్పందించి నోరు విప్పడంతో ఒక్కొక్కటి వెలుగుచూసింది. ఆలస్యంగానైనా ఆనాటి ప్రభుత్వం విచారణకు ఒక కమిటీని వేసింది. ఈ సందర్భంగా మృతి చెందిన విద్యార్థిని తాను ఏపరిస్థితిలో ఆత్మహత్య చేసుకుంటున్నదో తండ్రిని ఉద్దేశిస్తూ ఆమె రాసిన వ్యాఖ్యలు ఎంతటి పాషాణహృదయాలకైనా కన్నీళ్లు తెప్పిస్తాయి. ఆమె చివరిగా తన చావుకు కారణం ఎవరో వాళ్లకు తెలుసు. వాళ్లు తెలుసుకుంటే చాలు. ఇంకెవరిని నాలా బాధపెట్టకూడదు అని ఆ డైరీ రాసి కన్నుమూసింది. ఆ తర్వాత కూడా తెలుగు రాష్ట్రాల్లో ఈ ర్యాగింగ్ వికృత క్రీడ ఏమాత్రం ఆగడంలేదు. మొన్నశనివారం వరంగల్‌లో ఒక ప్రొఫెషనల్ కాలేజీలో ర్యాగింగ్ బయటపడింది. సస్పెన్షన్ లాంటి చర్యలు తీసుకున్నట్లు చెప్తున్నారు. అంతకుముందు కూడా అక్కడే సీనియర్ వేధింపులు భరించలేక పిజి చేస్తున్న విద్యార్థిని బలవంతపు మరణానికి పాల్పడింది. ఇలా అప్పుడప్పుడు బయటపడుతూనే ఉన్నాయి. కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవంగా ర్యాగింగ్ అనేది ముందుగా ఇంజినీరింగ్, మెడికల్ వంటి ప్రొఫెషనల్ కళాశాలల్లో 19వ శతాబ్దంలోనే ఆరంభమైనట్టు చెప్తారు. రానురాను కళాశాలలన్నింటికి పాకింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఒర్చి సెకండరీ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించు కొని కాలేజీలో అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టడానికి చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైనా అది శృతిమించి కొందరు విద్యార్థులకు ప్రాణాంతక వికృత క్రీడగా మారి పోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కు కొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి. అశ్లీల సాహిత్యం, నీలిచిత్రాలు, మత్తుపదార్థాలు, ఇతర బలహీనతలు తోడు కావడంతో ఈ అమానుషత్వం పరాకాష్ఠకు చేరింది. ఇప్ప టికే ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు బలైపోయా రు. అకారణంగా ఉజ్వల భవిష్యత్ ఉన్న పిల్లలను కోల్పో యిన ఆ కుటుంబాల గర్భశోకం ఎలా తీరుతుందో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ర్యాగింగ్‌కు భయపడి మరెందరో విద్యార్థులు ఏకంగా విద్యాభ్యాసానికి స్వస్తి చెప్తున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ర్యాగింగ్‌ను అదుపు చేయడానికి పాలకులు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. తర్జన భర్జనలు చాలా జరిగాయి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమగ్రమైన చట్టమే తీసుకువచ్చారు. ఆ చట్టప్రకారం వేధింపులకు గురి చేసినా ఆరునెలల జైలుశిక్షతో ప్రారంభమై అసహజ చర్యలకు పాల్పడినట్లు రుజువు అయితే ఐదేళ్ల జైలుతోపాటు పదివేల రూపాయల జరిమానా విధించవచ్చు. మరణానికి కారకులైనా, ఆత్మహత్యలకు ప్రేరేపించినా జీవితకాలం పదేళ్లపాటు జైలు, పదివేల రూపాయల జరిమానా విధించవచ్చు. అన్నింటి కంటే మించి ర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యాసంస్థల నుంచి తొలగించడమేగాక వారిని ఎక్కడ చేర్చుకోరాదని పటిష్టమైన చట్టమే చేశారు. చట్టమైతే చేశారు కానీ దాన్ని త్రికరణశుద్ధిగా అమలు చేసే మనసు పాలకులకు లేకుండాపోతున్నది. అందుకే తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ రాక్షసక్రీడ పెరిగిపోతున్నది. సంఘటనలు జరిగినప్పుడు నాలుగైదు రోజుల పాటు అధికారులు, నేతలు హడావుడి చేయడం, ఆతర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారిపోయింది. గత రెండు దశాబ్దాలుగా ఎన్ని ర్యాగింగ్ కేసులు జరిగాయి? ఎన్నింటిలో సమర్థవంతమైన దర్యాప్తు జరిపి తిరుగులేని సాక్ష్యాలతో న్యాయస్థానాల ముందు రుజువు చేసి శిక్షలు వేయించగలిగారు? రికార్డులు పరిశీలిస్తే డొల్లతనం బయటపడుతుంది. కమిటీలు, దర్యాప్తులతో కాలక్షేపం చేయకుండా రాజకీయాలకు అతీతంగా ర్యాగింగ్‌పై పాల్పడేవారిపై పటిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ఈ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, కమిటీలు దర్యాప్తులు అన్నీ నిష్ప్రయోజనమే.

భోగాలు పెరిగితే నరుడు రోగాలపాలై కన్నీరు కార్చక తప్పదు.



సత్యసాయి బాబా

మనలోని సహజశక్తులే మన అనారోగ్యానికి నిజమైన ఔషధాలు.



హిపోక్రేట్స్

# ప్రజావాక్కు



### పేలుడు పదార్థాల నిల్వ

రాష్ట్రవ్యాప్తంగా పేలుడు పదార్థాలు నిల్వచేసే గోదాములు అనేక చోట్ల నిర్వహించబడుతున్నాయి. గ్రానైట్, క్రషర్లు, తదితర మైనింగ్ నిర్వహణకు ఉపయోగించే పేలుడు పదార్థాల నిల్వచేసే గోదాముల పట్ల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పేలుడు పదార్థాల నిల్వ చేసే గోదాముల నిర్వహణ పట్ల విధి విధానాలు, నియమనిబంధనలు ప్రకటించాల్సిన అవసరంఉంది. ఇక వరంగల్‌జిల్లా నల్లబెల్లిమండల కేంద్రంలో పేలుడు పదార్థాల నిల్వ చేసే గోదాముల నిర్వహణ ఆ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారుతున్నది. ఈ నేపథ్యంలో పేలుడు పదార్థాలను నిల్వ చేసేందుకు నియమనిబంధనలు పాటిస్తున్నారా? అనేది అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

-కోగిల చంద్రమౌళి, వరంగల్‌జిల్లా

### సంక్షేమ పథకాలకు ధనమెక్కడిది?

సంక్షేమ పథకాలు అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అమలు చేయడానికి సిద్ధపడుతూ ఉన్నాయి. దీనికి ధనం ఎవరిస్తున్నారు అని ప్రశ్నించుకుంటే ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజానాయకులుకానేకాదు. బడా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ధనికులు, పేదవర్గాల వారు అంతకన్నా కానే కాదు. అత్యధిక సంపన్నులను కాపాడటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తూనే ఉంటాయి. వారి నుండి పార్టీ ఫండింగ్ పొందడానికి ఆయా రాజకీయ పార్టీలు వారికి తగిన విధంగా సహాయం చేస్తూ ఉంటాయి. వారు పన్నులు చెల్లించడం లేదనేది నిజం. పేద వర్గాల వారి పేదరికం డెఫినిషన్ మారిపోయింది. రిచ్ పీపుల్ ఏమి అనుభవిస్తున్నారో, ఎలాంటి వస్తువులు వాడుతున్నారో పేదవారు కూడా అలాంటివే వాడుతున్నారు.

వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

### అందరికి విద్యనందించాలి

విద్యలేనివాడు వింత పశువు. కనుక విద్యను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలి. విద్య ఒకేలాగ ఉండదు. అది మారుతుంది. సమాజంతోపాటు విద్య మారుతుంది. కనుక విద్యకు ప్రతిప్రభుత్వం మొదటి స్థానంఇవ్వాలి. సిలబస్ కఠినంతరం చేయాలి. సిలబస్ సులభంగా ఉంటే విద్యపై నిర్లక్ష్యం ఉంటుంది. పాస్‌మార్కులు నలభైశాతం నిర్ణయించాలి.

-వి.కనకమ్మ, విశాఖపట్నం

### బాలికల చదువులపై ఆంక్షలు

అఫ్ఘానిస్థాన్ తాలిబన్ పాలకులు చదువులపై వింత ఆంక్షలు విధించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బాలికలు కేవలం ఆరో తరగతితోనే తమ చదువులను ముగించాలని తాలిబన్ సర్కార్ ఆదేశించింది. రెండు దశాబ్దాలపోరాటం తర్వాతనాటో, అమెరికా సేనలు 2021సెప్టెంబర్‌లో అఫ్ఘానిస్థాన్ నుంచి నిష్క్రమించాయి. అనంతరం కొద్ది రోజులకే తాలిబన్ల కన్ను బాలికల చదువులపై పడింది. ఆరో తరగతి నుంచి చదవడానికి వీలు లేదని ఆంక్షలుపెట్టింది. 2022 డిసెంబర్‌లో ఈ నిషేధాన్ని విశ్వవిద్యాలయాలకు వర్తింపచేసింది. ఇలాంటి చర్యలు తీసుకుంటే తాలిబన్ ప్రభుత్వానికి అధికార గుర్తింపునివ్వడం సాధ్యపడదని ప్రపంచ దేశాలు హెచ్చరించినా తాలిబన్లు ఖాతరు చేయడం లేదు. తాలిబన్ల చర్యఉన్న చదువును చదవాలనే బాలికల ఆశలకు గొడ్డలిపెట్టు. యూనిసెఫ్ ప్రపంచ దేశాలు స్పందించాలి.

-చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### ఆంధ్రకి గమ్యం ఆరోగ్య సమాజం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త క్రీడోత్సవం ఆడుదాం ఆంధ్ర. డిసెంబరు 26 నుండి ఫిబ్రవరి 10వరకూ వివిధ దశల్లో జరిగే ఈ ఆటల పండుగ దేశంలోనే వినూత్నం. రాష్ట్రంలో ప్రతీ గ్రామంలో ఆస క్తి ఉన్న పౌరులందరూ పాల్గొనే అవకాశం కల్పించిన ఆటల పోటీల ద్వారా లక్షలాదిమంది పాలు పంచుకోవడం బహుశా ఏ దేశంలోనూ జరిగి ఉండదు. ఆరోగ్య సమాజం ఏర్పాటు ధ్యేయం సాధనంలో ఈ కార్యక్రమం కీలకం కానుంది. మనదేశంలో క్రీడా సంస్కృతి రానురాను తగ్గిపోతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తారతమ్యం లేకుండా త్వరితంగా మాయమవుతుంది. ఫలితంగా ఎంతో క్రీడా శక్తి నిరుపయోగంగా మారుతోంది. నూరు కోట్ల ప్రజలున్నా అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో ఉండడం దీనికి సాక్ష్యం.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### రుణాలు మంజూరు చేయాలి

బడా వ్యాపారులను కాకుండా చిరువ్యాపారులను సముచిత రీతిలో ప్రభుత్వంఆదుకోవాలి. చాలామంది చిరు వ్యాపారులు, ఈ చిన్నవ్యాపారంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇలాంటి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేస్తే, వారికి ఆర్థిక స్వావలంబన కలిగి ఆర్థికంగా బలపడతారు.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

# 'పత్రా'లలో ప్రజాభిమతం ప్రతిబింబించాలి

**ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం కాదు. ప్రజల అభిమతం మేరకు ఆకాంక్షల మేరకు పాలన జరగాలి. కొత్తపాత్రలో రెండు పార్టీలు ఒదిగిపోవాలి. ప్రజల కోసం పనిచేయాలి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ఎంతబలంగా పనిచేస్తే ప్రభుత్వాలు అంత బాధ్యతాయుతంగా పనిచేస్తాయి. కాబట్టి తెలంగాణ ప్రజలు తెలంగాణ కోసం పోరాడిన పార్టీని ప్రతిపక్షంగా వ్యవహరించాలని ఆదేశించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఒక అవకాశం ఇస్తూరాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబట్టే బాధ్యతను అప్పచెప్పారు. కాబట్టి రెండు పార్టీలు రెండు పక్షాలు ప్రజలకోసం బాధ్యతాయుతంగా పనిచేస్తారని ఆశిద్దాం.**

డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన ఒక దశాబ్దం తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. తొలిసారి తెలంగాణ రాష్ట్రంలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తూ రాష్ట్ర శాసనసభలో చర్చకు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి శ్వేత పత్రంలో బడ్జెట్‌లో కేటాయింపులు వాస్తవిక వ్యయం మధ్య అంతరం, రాష్ట్ర అప్పుల గురించి ప్రస్తావిస్తే రెండవ శ్వేత పత్రంలో మాత్రం విద్యుత్ రంగనష్టాల గురించి ప్రధానంగా ప్రస్తావించారు. అధికార పక్షం విడుదల చేసిన శ్వేతపత్రాలకు జవాబుగా ప్రతిపక్షం కూడా స్వేద పత్రం విడుదల చేసి తమ పాలనలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టామని ప్రభుత్వ శ్వేతపత్రాన్ని తిప్పి కొట్టే ప్రయత్నం చేసింది. గత ప్రభుత్వం తన పది సంవత్సరాల పాలన కాలంలో వివిధ మార్గాల ద్వారా పెద్దఎత్తున రుణాలను సేకరించడం వలన రాష్ట్రం అప్పుల కుప్పగా మారిపోయిందని ప్రభుత్వం శ్వేత పత్రంలో ప్రధానంగా చూపించే ప్రయత్నం చేసింది. పది సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ బడ్జెట్, బడ్జెటేతర రుణాలు కలిపి ఐదు లక్షల 99వేల కోట్ల రూపాయలను సేకరించడం వలన రాష్ట్ర మొత్తం అప్పు ఆరు లక్షల 71 వేల కోట్ల రూపాయలుగా ఉందని ప్రభుత్వం చెబుతుంది. ఈ పది సంవత్సరాల కాలంలో రాష్ట్రరుణాలు 24.5శాతం పెరిగినాయి. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోని మరొక కీలక అంశం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గత ప్రభుత్వం పది బడ్జెట్‌లను ప్రవేశపెట్టింది. బడ్జెట్‌లలో కేటాయింపులకి వాస్తవిక వ్యయానికి 20 శాతం అంతరం ఉందని ప్రస్తుతం చెబుతుంది. లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టినా వాస్తవిక వ్యయంలో మాత్రం తేడాలు ఉన్నాయి. పేద ప్రజలకు ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకి వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినా ఖర్చు చేయలేదు. ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు కీలకమైన విద్య వైద్యరంగాలపై బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయని ప్రస్తుత ప్రభుత్వం తన శ్వేతపత్రంలో పేర్కొంది. 13వేల కోట్ల రూపాయల మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటు బడ్జెట్‌కి దిగజారిపోయిందని ప్రస్తుత ప్రభుత్వం చెప్తుంది. 10 సంవత్సరాలలో 14 లక్షల 80వేల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రతిపాదనలు చేస్తే వాస్తవంగా ఖర్చు చేసింది మాత్రం 12లక్షల 24వేల కోట్లరూపాయలే ప్రభుత్వం విడుదల చేసిన రెండో శ్వేతపత్రంలో తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలకి 1.14 లక్షల కోట్ల రూపాయల భారం ఉందని ప్రస్తుత ప్రభుత్వం చెప్తుంది. డిస్కముల నష్టాలు 62వేల కోట్ల రూపాయలు, విద్యుత్ సంస్థల అప్పులు 78వేల కోట్ల రూపాయలు, 28వేల కోట్ల రూపాయల బకాయిలతో విద్యుత్ రంగాన్ని గత ప్రభుత్వం కోలుకోలేని దెబ్బతీసిందని ప్రస్తుత ప్రభుత్వం తన శ్వేత పత్రంలో పేర్కొంది. గత ప్రభుత్వం బడ్జెట్ నిర్వహణలో విద్యుత్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అప్పుల విషయంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడం వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదని కొత్తగా




అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చెప్తుంది. ప్రభుత్వ శ్వేత పత్రాల ద్వారా గత ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలకి శాసనసభలో సమాధానాలు చెప్పిన గత ప్రభుత్వం ప్రస్తుత ప్రతిపక్షం నష్ట నివారణ చర్యలలో భాగంగా తమ పార్టీ కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో స్వేదపత్రం ద్వారా ప్రభుత్వ శ్వేతపత్రంలో వాస్తవాలఉ వక్రీకరించిందని మా పాలన కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టామని చెప్పే ప్రయత్నం చేసింది. మా పాలన పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో విధ్వంసం నుండి వికాసం, సంక్షోభం నుండి సంక్షేమం వైపు రాష్ట్రాన్ని నడిపించామని చెప్పే ప్రయత్నం ప్రతిపక్షం చేసింది. మాపై కోపంతో రాష్ట్రాన్ని విఫల రాష్ట్రంగా చిత్రీకరించి రాష్ట్ర ప్రతిష్ట దిగజార్చటం వలన పెట్టుబడులు ఎలా వస్తాయి? అంతర్జాతీయ సంస్థలు ఎలా పెట్టుబడులు పెడతాయని ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టే ప్రయత్నం చేస్తుంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం తక్కువగానే అప్పులు చేసిందని ఆఅప్పులతో, దరిదాపు 50 లక్షల కోట్ల రూపాయల సంపదను సృష్టించామని చెప్పుకునే ప్రయత్నం ప్రతిపక్షం చేస్తుంది. విద్యుత్ కేంద్రాలు, మెడికల్ కాలేజీలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ నూతన హాస్పిటల్స్, కలెక్టరేట్ భవనాల నిర్మాణం, సచివాలయం గురుకులాలు, మౌలిక వసతుల కల్పన ఆధ్యాత్మిక సంపద పెట్టుబడులతో రాష్ట్రంలో సంపద సృష్టించామని రాష్ట్రాన్ని విధ్వంసం నుండి వికాసంవైపు నడిపించామని గత ప్రభుత్వం తన స్వేదపత్రంలో చెపుతుంది. మా పాలన కాలంలో తెలంగాణ రాష్ట్రం ఆదాయం 14 లక్షల కోట్ల రూపాయలకు పెరగటమే కాదు. మూడు లక్షల 17వేల రూపాయల తలసరి ఆదాయంతో దేశంలోనే తెలంగాణని మొదటిస్థానంలో నిలబెట్టామని స్వేద పత్రంలో చెప్పారు. తెలంగాణ నిర్మాణంలో మీరు చూపించిన స్వేదం కంటే మీ అప్రజాస్వామిక రాజరికపాలన పోవాలని ప్రజలు భావించారు. కాబట్టే మీకు ప్రతికూల ఫలితం ఎదురైంది. గత ప్రభుత్వం రూపొందించిన టి.ఎస్.ఐపాస్, ఐటి పాలసీ కొంతమేరకు తెలంగాణలో సంపద సృష్టికి దోహదపడిందేమో కానీ మెజార్టీ ప్రజల సంక్షేమం పట్ల మీ ప్రభుత్వవైఖరి ప్రజలలో వ్యతిరేకతను మూటకట్టిందనే చెప్పాలి. పెన్షన్, బీమా, బందులతోటే ప్రజాసంక్షేమం అనే మీ భావనను ఆత్మగౌరవం మెండుగా ఉన్న తెలంగాణ ప్రజలు తిరస్కరించారని ఇప్పటికైనా గత ప్రభుత్వం గుర్తించాలి. అదే మొండి వాదనతో భవిష్యత్తు రాజకీయాలు చేస్తే ప్రజలు నమ్మరు అనే విషయాన్ని కూడా గ్రహించాలి. అయితే అధికారపక్షం శ్వేతపత్రంలో ప్రతిపక్షం స్వేదపత్రంలో చెబుతున్న విషయాలను తెలంగాణ శాసన సభ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో ప్రచారాస్త్రాలుగా చెప్పినవే. వాటిపైన ప్రజలు తమ స్పష్టమైన తీర్పుని ఇచ్చారు అనే విషయాన్ని రెండు పక్షాలు గుర్తించాలి. గత ప్రభుత్వం భౌతిక సంపదను సృష్టించడానికి ఆరాటపడినంతగా మానవ సంపద, దాని మనుగడపై దృష్టి పెట్టలేదు అనేది వాస్తవం. సచివాలయం కూలగొట్టి కట్టడానికి చూపిన శ్రద్ధ పేదల ఇళ్లపథకం పట్ల చూపలేదు. యువతఉపాధి, ఉద్యోగాల పట్ల చూపలేదు. కాబట్టే గత ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించి మార్పు కోరుకున్నారు. ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం కాదు. ప్రజల అభిమతం మేరకు ఆకాంక్షల మేరకు పాలన జరగాలి. కొత్తపాత్రలో రెండు పార్టీలు ఒదిగిపోవాలి. ప్రజల కోసం పనిచేయాలి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ఎంతబలంగా పనిచేస్తే ప్రభుత్వాలు అంత బాధ్యతాయుతంగా పనిచేస్తాయి. కాబట్టి తెలంగాణ ప్రజలు తెలంగాణ కోసం పోరాడిన పార్టీని ప్రతిపక్షంగా వ్యవహరించాలని ఆదేశించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఒక అవకాశం ఇస్తూరాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబట్టే బాధ్యతను అప్పచెప్పారు. కాబట్టి రెండు పార్టీలు రెండు పక్షాలు ప్రజలకోసం బాధ్యతాయుతంగా పనిచేస్తారని ఆశిద్దాం. ●

# ఆన్‌లైన్ ఉన్నా..'లైన్ల'లో నిల్చోవాల్సిందేనా?

ఫిరోజ్ ఖాన్

ప్రజాపాలన పేరుతో డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు ప్రజల వద్దకు వెళ్తామని తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వం చెప్పింది. ప్రతిరోజు ఉదయం ఒక గ్రామంలో 8-12 గంటల వరకు, మధ్యాహ్నం మరో గ్రామంలో 2-6 గంటల వరకు గ్రామసభలు నిర్వహిస్తామని పేర్కొన్నది. అక్కడే ఆరు గ్యారంటీల అమలుకు దారఖస్తులను స్వీకరించి, అర్హులను ఎంపిక చేస్తామని వెల్లడించింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీళ్లు, నీడ సౌకర్యాలు కల్పిస్తామని, రద్దీని కంట్రోల్ చేయడానికి, తొక్కిసలాట జరగకుండా ఉండడానికి పోలీసులు ఉంటారని చెప్పింది. ప్రపంచమంతా ఆన్‌లైన్ మయం అయ్యాక ప్రజలను గంటల తరబడి లైన్లలో నిల్చోబెట్టి దరఖాస్తులను స్వీకరించాల్సిన అవసరం ఎందుకొస్తున్నదో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరమున్నది. ఆధార్ అప్‌డేట్‌ను అనధికారికంగా తప్పనిసరి చేయడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఒకరోజు టోకెన్ తీసుకోవడానికి, వారిచ్చిన తేదీ ప్రకారం వాటిని అప్‌డేట్ చేసుకోవడానికి రెండు రోజుల పాటు గంటల తరబడి లైన్లలో నిల్చుంటున్నారు. రేషన్ కార్డును కూడా అప్‌డేట్ చేసుకోవాలని చెప్పడంతో అక్కడకూడా అదే సమస్య ఎదురవుతున్నది. ప్రజలు రోజుల తరబడి పనులన్నీ విడిచిపెట్టి వీటి వెనుకాలే తిరగాల్సి వస్తున్నది. ఇప్పుడు సిక్స్ గ్యారంటీస్‌కు అర్హుల ఎంపిక పేరుతో ప్రభుత్వం మళ్లీ గ్రామసభలంటూ తేదీలు ఫిక్స్ చేయడం, గంటల తరబడి నిల్చునేలా చేయడం ప్రజలకు ఇబ్బందే. అర్హుల ఎంపికలో ఎలాంటి పక్షపాతం ఉండదని ఓవైపు ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా 'కాంగ్రెస్' మార్క్ కనిపించేందుకే ప్రజాపాలన నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతున్నది. అర్హులను ఎంపిక చేసేటప్పుడు గ్రామ, మండల, జిల్లా పార్టీ నాయకులు అక్కడే ఉండేలా ఇప్పటికే గాంధీ భవన్ నుంచి ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది. దీంతో పార్టీకి మైలేజ్ వస్తుందని ప్రభుత్వ పెద్దలు భావించినా, ఇక్కడే ప్రజలకు అసలు సమస్య ఎదురయ్యే అవకాశమున్నది. సర్పంచ్, కౌన్సిలర్, కార్పొరేటర్‌ను ఆహ్వానించాలని చెప్పినా' పార్టీ మార్క్' కోసం వారి సూచనలు పరిగణనలోకి తీసుకోకపోయే ప్రమాదమున్నది. దీంతో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకులు అధికారులపై పెత్తనం చెలాయించే అవకాశమూ కనిపిస్తున్నది. తద్వారా అర్హుల ఎంపికలో అక్రమాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. 64 స్థానాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించారు. కానీ అదే సమయంలో 39 స్థానాలతో బిఆర్ఎస్, 8స్థానాలతో బిజెపి, 7స్థానాల్లో ఎంఐఎం గెలుపొందాయి. దీంతో సభలో ప్రతిపక్షం కూడా బలంగానే కనిపిస్తున్నది. ఇలాంటి సమయంలో పార్టీకి మైలేజీ తీసుకురావడానికి ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కుట్ర జరుగుతున్నదనే అనుమానం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని చోట ఓడిపోయిన అభ్యర్థులకు, పార్టీ నేతలకు ప్రాధాన్యత ఇస్తామని ఇప్పటికే పార్టీ పెద్దలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దీంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధికి కాకుండా పార్టీకి పెత్తనం ఇచ్చినట్లవుతుంది. దీంతో ప్రజల నిర్ణయాన్ని ప్రభుత్వమే ప్రశ్నించినట్లవుతుంది. ప్రభుత్వ ఉద్దేశ్యాలు మంచివైతే పథకాల కోసం లబ్ధిదారుల ఎంపికను ఎలాంటి డెడ్‌లైన్ లేకుండా నిరంతరాయంగా కొనసాగించాలి. పార్టీలతో సంబంధం లేకుండా, పక్షపాతంగా వ్యవహరించకుండా అర్హులను ఎంపిక చేయాలి. పార్టీనేతలకు ప్రాధాన్యతనివ్వడం తప్పుకాకపోయినా ప్రతిపక్షం పేరుతో ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేల సూచనలను పట్టించుకోకపోతే ప్రజల ఎంపికను ప్రభుత్వం ప్రశ్నించినట్లే. ●

# కాశ్మీర్‌లో సహజ న్యాయానికి కత్తెర?

నాదెండ్ల శ్రీనివాస్

జమ్మూ-కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి హామీ ఇచ్చిన ఆర్టికల్ 370ను రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, కేంద్ర పాలిత ప్రాంతం స్థాయికి కుదించిన మోడీ ప్రభుత్వం చర్యలు సబబేనంటూ సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. అయితే సుప్రీం కోర్టు తీసుకున్న ఈ చర్యలు జాతీయ సమైక్యతకు తీరని హానిని కల్గిస్తాయి. సుప్రీం కోర్టు తీర్పుతో అందరూ సృజనాత్మకంగా, కలిసికట్టుగా ఎదగడానికి వీలు కల్పించే సమాఖ్య చట్రానికి తూట్లు పడ్డాయి. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే చట్టం పేరుతో జాతీయ స్థాయిలో భావోద్వేగాలు ప్రేరిపించి, భారతీయ సమాజాన్ని మొత్తంగా అతి తీవ్ర జాతీయవాదం వైపు, సైనికీకరణ మనస్తత్వం వైపు నడిపించడానికి ఆర్ఎస్ఎస్ సాగిస్తున్న ప్రయత్నానికి ఈ తీర్పు అండగా నిలబడుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దును సమర్థించిన సుప్రీం కోర్టు జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని నిరాకరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం రాజ్యాంగాన్ని తీవ్రంగా ఉల్లంఘించిన కార్యనిర్వాహకులను బాధ్యులను చేయడంలో సుప్రీం కోర్టు వైఫల్యాన్ని తేటతెల్లం చేసింది. అంతేకాక రాజ్యాంగం పట్ల ప్రజల విశ్వాసాన్ని కూడా సుప్రీంకోర్టు దిగజార్చింది. ఆర్టికల్ 370 జమ్మూ-కశ్మీర్‌కు సార్వభౌమాధికారాన్ని ఇవ్వలేదు, కానీ రిపబ్లిక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడంలో ఇది కీలకమైనది. ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగ రక్షణకల్పించడం అనేది సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు కేవలం 'అసమాన సమాఖ్య' అంశం మాత్రమే కాదు, భారత దేశంతో కశ్మీర్ విలీన చరిత్రలో దాని మూలాలు ఉన్నాయి. ఆర్టికల్ 370 వంటి కొన్ని ప్రత్యేక హక్కులను కలిగి ఉన్న అనేక ఇతర రాష్ట్రాలు భారతదేశంలో ఉన్నాయి. కానీ దురదృష్టవశాత్తు సుప్రీం కోర్టు జమ్మూ, కశ్మీర్‌ను మాత్రమే అసమానత సమాఖ్య కేసుగా ప్రకటించింది. ఆపై అసమానతలను సరిదిద్దే పేరుతో, జమూకశ్మీర్ రాష్ట్ర హోదాను రద్దుచేసి, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించి కేంద్ర ప్రభుత్వ చర్యలను విస్మరించింది. జమ్మూ -కశ్మీర్‌ను రాష్ట్రంగా ఏర్పాటు చేసి నాలుగేళ్లు గడిచినా శాసనసభ ఎన్నికలు జరగకపోవడం మౌఖిక హామీ ఆధారంగా సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని నిర్దోషిగా ప్రకటించడం దుర్భష్టకరం. ఈచర్య రాజ్యాంగ ఔచిత్యాన్ని విస్మరించింది. రాజకీయ ప్రతిపక్షాన్ని, ప్రాథమిక హక్కులను అణచివేసే కశ్మీర్ లోయ నమూనా ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యాన్ని తోసిపుచ్చేందుకు ఉపయోగించబడుతోంది. జమ్మూకశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం ముందుముందు మరింత పేట్రేగిపోతుంది. ఈ ఆర్టికల్ కశ్మీర్‌కు స్వతంత్ర హోదా కలిపిస్తుంది. రక్షణ, విదేశాంగ వ్యవహారాల్లో మినహా ఈరాష్ట్రానికి సంబంధించి ఏ చట్టం చేయాలన్నా, ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఆరాష్ట్ర ప్రభుత్వ అనుమతితో మాత్రమే చేయాల్సి వుంటుంది. కానీ అలాంటి ప్రక్రియ యేదీ లేకుండా కేంద్రం ఏకపక్షంగా ఈ ఆర్టికల్‌ను రద్దుచేసింది. పైగా అక్కడ ప్రజా ప్రభుత్వమేదీ లేని సమయాన్ని, రాష్ట్రపతి పాలన ద్వారా తమనియంత్రణ కొనసాగుతున్న సమయాన్నీ ఒక అవకాశంగా తీసుకుని ఈ చర్యకు తెగబడింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా చేయడానికి సన్నాహంగానే అక్కడ రాష్ట్రపతి పాలన విధించి ఈ దుర్మా




ర్గానికి ఒడిగట్టింది. కానీ సుప్రీంకోర్టు ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా అక్కడ ప్రభుత్వమే లేనప్పుడు ఇక అనుమతులకూ, అభిప్రాయలకూ ఆస్కారమే లేదన్నట్లుగా వ్యవహరించడం న్యాయమేనా? ఈ ఆర్టికల్ ద్వారా కశ్మీర్‌కు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయి. అయితే ఇవన్నీ సుప్రీం ధర్మాసనం గమనంలో ఉన్నాయో లేవో తెలియదు గానీ ఇకపై దేశంలోని అన్ని రాష్ట్రాల వలనే జమ్మూ కశ్మీర్ కూడా అతి తన తీర్పులో వ్యాఖ్యానించింది. దీంతో 371 అధికరణం ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో పాటు దాఖలు పడిన హక్కులు కూడా కశ్మీర్‌లకు లేకుండాపోతాయా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. బ్రిటిష్ ఇండియా రూపుదిద్దుకున్న జాతీయ ఆకాంక్షలతో గానీ జాతీయోద్యమ ఆదర్శాలతోగానీ, రాజ్యాంగ రూపుకల్పనా ప్రక్రియతోగానీ ఏమాత్రం సంబంధం లేనిశక్తులు నేడు దేశాన్ని పాలిస్తున్నాయి. భిన్నత్వంలో ఏకత్వం భావనకు విరుద్ధంగా హిందూ రాష్ట్ర భావనను ప్రాచుర్యంలోకి తెచ్చిన సావర్కర్, హెగ్డేవార్ గోల్వాల్కర్ వంటి వారు అప్పట్లో తమ ప్రజల మద్దతును కూడగట్టుకోలేకపోయారు. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మౌలానా అబుల్ కలామ్ అజాద్, భగత్ సింగ్, కమ్యూనిస్టులు అనేక అంశాలలో భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నప్పటికీ స్వాతంత్ర్యానంతరం భారత దేశం ఒక ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద దేశంగా, ఆధునిక, నాగరిక శాస్త్రీయ వివేచనగల సమాజంగా వుండాలని గట్టిగా భావించారు. మహమ్మదాలీ జిన్నా, సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతాన్ని వారు గట్టిగా ఎదుర్కొన్నారు. బ్రిటీష్ పాలకుల విభజించి పాలించే కుటీల నీతిని ప్రతిఘటించారు. దేశ విభజన తప్పని పరిస్థితుల్లో జాతీయ నాయకత్వం విభజన గాయాలను త్వరితగతిన మాన్పే ప్రయత్నం చేసింది. స్వదేశీ సంస్థానాలలోని ప్రజా పోరాటాలను జాతీయోద్యమం గట్టిగా బలపర్చింది. సంస్థాన పాలకుల అభిప్రాయాల కంటే స్థానిక ప్రజల అభిప్రాయాలకే విలువ ఇవ్వాలని ఒక మౌలిక సూత్రానికి నాయకత్వం ప్రాధాన్యం ఇచ్చింది. 1935భారత చట్టం, 1947భారత స్వాతంత్ర్యచట్టం, రాజ్యాంగ పరిషత్తులో జరిగిన చర్చలు, రాజ్యాంగంలో పొందుపరిచిన అధికరణలు నాటి పరిస్థితులను తేటతెల్లంచేస్తాయి. జాతీయోద్యమ నాయకత్వపు ఆలోచనలను, అవగాహనలను ఆ నేపథ్యంలో పరిశీలించాల్సి వుంటుంది. అయితే అప్పట్లో సమాజాన్ని ఒప్పించడంలో విఫలమైన హిందూ రాష్ట్రవాదులు అనంతర కాలంలో నిర్వహిస్తూ వచ్చారు. ముఖ్యంగా జమ్మూ-కశ్మీర్ విషయంలో జాతీయోద్యమ నేతల వైఖరులను వక్రీకరించారు. నేతలమధ్య లేనిపోని వైరుధ్యాలను సృష్టించారు. వారిని నేరస్థులుగా చూపించారు. 370 అధికరణాన్ని బూచిగా చిత్రీకరించారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా వుండటానికి 370అవకాశం కల్పించిన వాస్తవాన్ని తల్లకిందులుగా ప్రచారం చేస్తూ వచ్చారు. ఇప్పటికే 370ను రద్దు చేసిన కేంద్రం నేడు వేలాది మంది రాజకీయ నేతలను నిర్బంధించి, వార్తా, ప్రసారాల సాధనాలను చివరకు న్యాయస్థానాల్ని కూడా నియంత్రించి, కమ్యూనికేషన్ వ్యవస్థలను బందచేసి, కశ్మీర్‌లో నేడు అంతా సవ్యంగానే వుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. కానీ ప్రభుత్వచర్యలు సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. ప్రజల మనోగతాన్ని గౌరవించాలన్న జాతీయోద్యమ ఆదర్శాన్ని నేటిపాలకులు తుంగలో తొక్కారు. ప్రజాభిప్రాయాన్ని సైనిక బలం ద్వారా అణచడానికి చూస్తున్నారు. ఇటువంటి చర్యల ద్వారాసమస్య పరిష్కారంకాదు. ఆపేరుతో మరిన్ని భావోద్వేగాలను సృష్టించడం, నియంతృత్వాధికారాలను కేంద్రీకృతం చేసుకోవడం, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడం లక్ష్యంగా పాలకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పాలకుల కుట్రలను, తప్పుడు ప్రచారాలను ఎదిరించి, భారత రాజ్యాంగ మౌలిక భావనలను రక్షించుకోవడం మనముందున్న తక్షణ కర్తవ్యం. ●

06ATP27_06ATP27.qxd 26-12-2023 PM 10:34 Page 1



## కోనాపురం చెరువుకు హంద్రీనీవా నీటి మళ్లింపునకు లైన్ క్లియర్..!

**-కాలువ తవ్వకంతో భూమి కోల్పోయే రైతుతో ఒప్పొందం చేసుకున్న రైతులు -నేటి నుండి యుద్ధ ప్రాతిపదికన కొనసాగనున్న పిల్ల కాలువ తవ్వకం పనులు**

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త


యుపీఎస్ సీఐ యం.తిమ్మయ్యతో తమ గోడు వెల్లబోసుకొంటున్న రైతులు

హంద్రీనీవా కాలువ నీటిని కోనాపురం చెరువుకు మళ్లించడానికి మార్గం సుగుమం అయింది. పిల్ల కాలువ తవ్వకం ద్వారా భూమిని కోల్పోనున్న మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులుతో కోనాపురం, చిన్నముష్టూరు, రాచెర్ల, రాచెర్ల తండా, మోపిడి తదితర గ్రామాలకు చెందిన రైతులు అవగాహన ఒప్పందం కుదుర్చుకొని రైతుకు లక్ష రూపాయలు అడ్వాన్సుగా చెల్లించారు. మూడు నెలల్లోపు కాలువ తవ్వకం ద్వారా రైతు కోల్పోయే దాదాపు 40 సెంట్ల భూమిని సెంటు 30వేల రూపాయలకు రైతులందరూ కలిసి కొనగోలు చేసేలా ఒప్పించారు. దీంతో దాదాపు రెండు నెలల కాలంగా హంద్రీనీవా నీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు పరిష్కారం లభించింది. హంద్రీనీవా నీటిని కోనాపురం చెరువుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఇదివరకే ఆయా గ్రామాల రైతులు ఉరవకొండ కోర్టును, తహశీల్దార్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో మంగళవారం రైతులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ యం.తిమ్మయ్య ముందు తమ గోడు వెల్లబోసుకొని కాలువ తవ్వకానికి చొరవ చూపాలని విన్నవించారు. దీంతో సీఐ హంద్రీనీవా అధికారులకు ఫోన్‌చేసి నీటి తరలింపునకు పూడి పోయిన పిల్ల కాలువ తవ్వకంపై చర్చించారు. ఈ క్రమంలో ఆయన సూచనల మేరకు రైతులు భూమి యజమాని అయిన రైతు శ్రీనివాసులుతో చర్చించి ఒప్పందం చేసుకున్నారు. బుధవారం నుండి హిటాచీలు పెట్టి పిల్ల కాలువ తవ్వకం పనులు మోదలు పెడతామని రైతులు తెలిపారు. హంద్రీనీవా నీరు కోనాపురం చెరువుకు చేరితే చుట్టుప్రక్కల వందలాది బోర్లు రీచార్జ్ అయి వందలాది కుటుంబాలు బాగుపడుతాయన్నారు. బోర్లు రీచార్జ్ అయిన వెంటనే కురగాయలు తదితర పంటలు సాగు చేసుకోవడానికి వీలుంటుందని సంతోషం వ్యక్తం చేశారు.

## జనవరి 7న ఉరవకొండలో సామాజిక సాధికార బస్సుయాత్ర

**-హాజరు కానున్న జిల్లా ఇంచార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు-సన్నాహక సమావేశంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి**


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త

జనవరి 7వ తేదీన ఉరవకొండ పట్టణంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు నియోజవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో మంగళవారం సామాజిక సాధికార బస్సు యాత్రపై నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.పి.వీరన్న అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ బస్సు యాత్రలో భాగంగా మధ్యాన్నం 3 గంటలకు పట్టణంలోని క్లాక్‌టవర్ కూడళిలో జరిగే బహిరంగ సభకు జిల్లా ఇంచార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల బాధ్యులు హాజరవుతారన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. సీయం జగన్ అణగారిన, వెనుకబడిన, మైనార్టీ వర్గాలకు రాజ్యాంగ పదవులతోపాటు నామినేటెడ్, పార్టీ పదవుల్లోనూ సముచిత స్థానం కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎంపీపీలు మండలాల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని బస్సు యాత్రకు జన సమీకరణపై చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, బెలుగుప్ప మండలాల తహశీల్దార్లు నరసింహులు, పుష్పావతి, దేవిబాయి, నారాయణరెడ్డి, పెద్దన్న, విడపనకల్లు జెడ్పీటీసీ హనుమంతు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బోయ సుశీలమ్మ, వజ్రకరూరు సర్పంచ్ మోనలిసా, ఎంబీసీ, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ల డైరెక్టర్లు జోగి వెంకటేష్, కె.గోవిందు, దుద్దేకుంట రామాంజినేయులు, టౌన్ బ్యాంకు అధ్యక్షులు చంగల మహేష్, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఏ.సి.ఎర్రిస్వామి, బోయ సుంకన్న, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, మాజీ ఎంపీపీ ఎస్.తిప్పయ్య, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు యం.బసవరాజు, జేసీఎస్ కన్వీనర్లు బి.ఆసీఫ్, ఉస్మాన్, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రెచ్చిపోయిన బైక్ రేసర్లు

పెనుకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త


బైక్‌పై విన్యాసాలు చేస్తున్న పోకిరీలు

పట్టణ సమీపంలోని ఆర్టిఓ చెక్ పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై బైక్ రేసర్లు రెచ్చిపోయారు. బాబయ్య స్వామి ఉరుసుకు వచ్చే కొంతమంది పోకిరి యువకులు రోడ్డుపై భయంకరమైన విన్యాసాలు చేస్తూ వాహనదారులను ఉలిక్కి పడేలా చేశారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు రోడ్డుపై హంగామా చేశారు. సైలెన్సర్‌ల శతాబ్దాలతో పట్టణంలో ప్రవేశించి ప్రజల భయభ్రాంతులకు గురి చేశారు. రోడ్లపైనే రేసర్‌లు గెలుపొందడంతో ట్రాఫిక్ ఆపేసి కేక్‌లు కట్ చేశారు. దాదాపు 100మందిదాకా బైక్‌రేసర్‌లురాగా పోలీసులుసైతం వారిని నిలువరించలేక చేతులు ఎత్తేశారు. గత వారం రోజుల క్రితం ప్రకాష్ అనే వ్యక్తి స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డికు బైక్ రేస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అయినా ప్రతి ఏడాది ఇదేతరహాలో పోకిరిలు ఆగడాలు కొనసాగడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.

## బాబయ్యస్వామి భక్తాదులకు అన్నదానం

పెనుకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త


అన్నదానం చేస్తున్న సవిత

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో శ్రీ బాబయ్య స్వామి ఉరుసు మహోత్సవానికి హాజరైన భక్తులకు మంగళవారం ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. సవిత 12 ఏళ్లుగా బాబయ్యస్వామి ఉరుసు వచ్చే భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. ఏడాది కూడా ఆర్టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు అన్నదానం ఎంతో ఉపయోకరం. అదే విధంగా పట్టణంలో ట్యాంకర్ ద్వారా ఉచిత మంచినీటిని సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీరాములు, గుట్టూరు సూర్యనారాయణ, డివి ఆంజినేయులు, వాసుదేవరెడ్డి, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీబాబయ్య స్వామి 751వ గంధం మహోత్సవం వేడుకలు

పెనుకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త



గంధాన్ని తలపై తీసుకెళ్తున్న దర్గా పీఠాధిపతి , పక్కీర్ల విన్యాసాలు

కన్నుల పండువగా శ్రీబాబయ్య స్వామి 751వ గంధం మహోత్సవం వేడుకలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా సందల్ మహల్ నుంచి పక్కీర్ల విన్యాసాలతో భక్తుల కోలాహలం నడుమున గంధం తలపై ఉంచుకొని బాబాయి స్వామి దర్గాకు వెళ్లారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బాబాయిస్వామి సమాధికి గంధాన్ని అంటించారు. ఈ వేడుకలను తినిపించడానికి దేశ వ్యాప్తంగా ఆంధ్ర, కర్ణాటక తెలంగాణ తమిళనాడు పాండిచ్చేరి మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. గంధం వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో సిఐలు, ఎస్సైలు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## చెట్ల కింద.. గోడ నీడన భోజనం అయినా పట్టించుకోని ప్రభుత్వం

అగళి, డిసెంబర్ 26 ప్రభాతవార్త


గోడ నీడన బోజనం చేస్తున్న అంగన్‌వాడీలు

గత అర్థమాసంగా అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం రోజూ వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. నేటికి 15 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి తీపి కబురు రాకపోవడంతో మంగళవారం రోజు కూడా తహశీల్దారు కార్యాలయం ముందు అంగన్‌వాడీలు తమ ఆందోళనను, ఆగ్రహాన్ని నిరసనను వ్యక్తం చేశారు. నిరసన అనంతరం కార్యాలయం గోడ నీడన చెట్ల కింద ఆయాలు కార్యకర్తలు భోజనాలు చేస్తూ తమ బాధలను మరొక్కసారి చర్చించుకున్నారు.

## ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతులు పంపిణీ

అగళి, డిసెంబర్ 26 ప్రభాతవార్త


బహుమతులను పంపిణీ చేస్తున్న ఎంపిపి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించింది. క్రికెట్, వాలీబాల్, కోకో, బాల్‌బ్యాడ్మింటన్ ఇలా దాదాపు 7 క్రీడల్లో పోటీలను నిర్వహించింది. ఈ క్రీడా పోటీలను అగళి ఉన్నత పాఠశాలలో ఎంపిపి రేణుకా కామరాజు, మధూడి పాఠశాలలో సర్పంచు శివన్న జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. విజేతలకు ఎంపిపితోపాటు కన్వీనర్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు, ఈఓఆర్డి పంచాయితీ కార్యదర్శిలు రంగనాథ్, వేణు, చంద్ర,జెవిఎస్ కన్వీనర్ శివన్న, మండల ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్, సర్పంచు లక్ష్మమ్మ, వైఎస్ఆర్‌సిపి మండల మీడియా కన్వీనర్ నారాయణతోపాటు మంజునాథ్ కాటప్పల ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

## భక్తరపల్లి జిల్లేడుగుంట జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

మడకశిర డిసెంబర్ 26 ప్రభాతవార్త;


ప్రత్యేక పూజలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

మండల పరిధిలోని భక్తరపల్లి జిల్లేడుగుంట జాతరలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇంఛార్జ్ గుండుమల తిప్పేస్వామి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ జడ్పిటీసి డాక్టర్ శ్రీనివాస మూర్తిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన భక్తరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట శ్రీఆంజనేయస్వామి జాతర మహోత్సవం మరియు కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, రఘురాం,రవీంద్రారెడ్డి, వైబిహళ్ళి సర్పంచ్‌రామాంజినేయులు, హనుమంతరాయప్ప, నరసేగౌడ్, ఉమేష్, అశ్వత్తనారాయణ, గుండప్ప, హనుమంతేగౌడ్, అడివన్న, మూర్తి, గిరిగౌడ్, నారాయణగౌడ్, లక్ష్మీనారాయణ, హర్షవర్ధన్, శ్రీనాథ్‌గౌడ్, శివశంకర్, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యత వెలికితీతకు ఉపయుక్తం

గుత్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న క్రీడానైపుణ్యతకు క్రీడాపోటీలు ఉపకరిస్తాయని మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూరబీ, వైస్‌చైర్మన్ వరలక్ష్మీయాదవ్, కమీషనర్ శ్రీనివాసులు, సిఐ వెంకటరామిరెడ్డి, వైకాపా ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను వారు ప్రారంభిచారు. 47 రోజుల పాటు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలను వార్డు సచివాలయాల వారిగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు తదుపరి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. విద్యతో పాటు క్రీడాపరంగా ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. విజేతలకు దాదాపు 12 కోట్ల రూపాయల నగదు బహుమతులు ప్రభుత్వం అందచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరా, మున్సిపల్ మేనేజర్ మురళీధర్, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, ఫారుక్, జిల్లా నాయకులు రాజ్‌కుమార్, గురుప్రసాద్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ రంగస్వామి, షఫి, సునీల్, దస్తగిరి, పిఇటిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం


సిపిఐ పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

గుత్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : పట్టణంలో మంగళవారం సిపిఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో సీనియర్‌నేత షఫి పతాకావిష్కరణ గావించారు. పార్టీ ఆవిర్భావం నుండి పోరాటాలకు దండుగా నిలిచింది సిపిఐ పార్టీ అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామదాసు, రాజు, వెంకటరాముడు, నరసింహులు, డానియల్, రమణ, కమలాకర్, మల్లికార్జున, రామాంజి, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

## రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు టౌన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త



ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రికి వచ్చే గర్భవతులు, ఇతర రోగుల పట్ల ప్రభుత్వ వైద్యులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రామిరెడ్డికాలనీకి చెందిన డెలివరీ ఫేషెంట్ షేక్‌షహానాబేగం ఈ నెల 23వతేదీన ఉదయం నొప్పులతో ఆసుపత్రికి వచ్చిందని ఆసుపత్రిలో వైద్యులు లేరని ఆమె పరిస్థితి అత్యవసరంగా వుందని ఒత్తిడి చేసి ప్రైవేటు నర్సింగ్‌హోంకు పంపడం జరిగిందని గుర్తుచేశారు. అయితే ఉరవకొండకు వెళ్లే క్రమంలో అంబులెన్స్‌లోనే సాధారణ కాన్పు జరగడం జరిగిందన్నారు. ఆమెను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి చేర్పించారన్నారు. అయితే ప్రతి నెలా ఆమె ప్రభుత్వ వైద్యులైన డాక్టర్ సుజాత వద్ద పరీక్షలు చేయించుకు ంటుండేదన్నారు. అయినా వైద్యులు ఆమెను కాన్పు సమయంలో నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. వైద్యం అందించడమే కాకుండా ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేయడం ఎంత వరకు సమంజమని ఆయన ప్రశ్నించారు. అలాగే కొలిమి రంగన్న అనే రోగి 24వ తేదీన గుండెనొప్పితో ప్రభుత్వాసుపత్రిలో అడ్మిట్‌అయితే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో వైద్యం అందక ఆయన మృతి చెందడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు డివిజన్ కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యులు దేవేంద్ర, పట్టణాధ్యక్షులు రామాంజినేయులు, నాయకురాళ్లు ఆశాబీ, మాబున్నీ, నాయకులు జిలాన్, బాష, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో మున్సిపల్ కార్మికుల ధర్నా

గుత్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త


కార్మికులు ధర్నా చేస్తున్న దృశ్యం

తమ న్యాయసమ్మతమైన సమస్యలను పరిష్కరించాలని కనీసవేతనం నెలకు 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట శిబిరంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాన పనికి తగు వేతనం ఇవ్వాలని కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, మహేష్, రామాంజినేయులు, సుంకన్న, మురళి, శేఖర్, నరసింహ, షరీఫ్, సిఐటియు నాయకులు నిర్మల, రమేష్, మల్లేష్, రామకృష్ణ, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమర్ ఖాన్ ఆధ్వర్యంలో అంగన్వాడిలకు అన్నదానం

**- మాజీ ఎమ్మెల్యే సతీమణి కమలమ్మ చేతుల మీదుగా అన్నదానం**

గోరంట్ల,డిసెంబర్ 26,ప్రభాతవార్త:


అంగన్వాడిలకు అన్నదానం చేస్తున్న దృశ్యం


అంగన్వాడిలతో కలసి నిరసన చేస్తున్న దృశ్యం

పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వద్దా మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడిలు చేపట్టిన నిరసన సమ్మె మంగళవారానికి 15 రోజులకు చేరుకోగా వారికి మద్దతుగా టిడిపి మైనార్టీ నాయకుడు ఉమర్ ఖాన్ భోజన వసతులు ఏర్పాటు చేయగా పెనుకొండ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బీకే పార్థసారథి సతీమణి కమలమ్మ,కుమారుడు సాయి కళ్యాణ్ చేతుల మీదుగా అంగన్వాడిలకు భోజనం వడ్డించారు.ఈ సందర్భంగా కమలమ్మ మాట్లాడుతూ అంగన్వాడిల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తొందరలోనే ఎన్నికలు ఉంటాయని టిడిపి ఆధికారంలోకి వచ్చిన తక్షణం తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు,నారాలోకేష్ మీ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఉమర్ ఖాన్,పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహులు,జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ రాయల్,తెలుగుదేశం అంగన్వాడి కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి,అజ్మతుళ్ల,సుబ్బరాయుడు,నరేంద్ర రాయల్,నరేష్ యాదవ్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని విస్తృత ప్రచారం

అమరాపురం.డిసెంబర్ 26,ప్రభాతవార్త:


టిడిపి నాయకులు కార్యక్రమ దృశ్యం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు అమరాపురం మండలం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కొర్రెవు,గునేహళ్లి,హేమావతి గ్రామాలలో బాబు షూరిటి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు మీనీ మ్యానిఫెస్టో పథకాలను గ్రామ స్థాయిలో వివరించడం జరిగింది.అనంతరం తల్లికి వందనం,అడబిడ్డ విధి,ప్రత్యేకంగ రైతులకు 20 వేల ఇచ్చేటటువంటి ఒక కార్యక్రమం,నారుద్యోగ యువతి, యువకులకు ప్రతి నెల 3వేల రూపాయలు ఇచ్చే ఒక నిర్వహిస్తున్నట్లు టిడిపి మడకశిర నియోజకవర్గ పరిశీలకులు పార్థసారథిరెడ్డి,కార్యదర్శి నరసింహామూర్తిలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్,ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు కాంతరాజు,జిల్లా తెలుగు యువత కార్యదర్శి కే.శివకుమార్,మండల టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి జయరామప్ప,టిఎన్‌టిసి జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్,మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి దాదు,రాష్ట్ర బీసీ సాదికిరిక కమిటీ సభ్యుడు మంజునాథ్,బీసీ సెల్ అధ్యక్షులు ధనుంజయ,టాఎన్జీయు అధ్యక్షులు ఎంజారప్ప,క్లస్టర్ ఇంచార్జ్ రవికుమార్,యూనిట్ ఇంచార్జ్‌లు లింగరాజు,హనుమంతరాయ,ప్రభాకర్,పులి రాజు,ప్రభాకర్,మాజీ సర్పంచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సామకోటి ఆధ్వర్యంలో బాబూష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ

బుక్కపట్నంరూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త


బాబూ ష్యూరిటీ,భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరిస్తున్న సామకోటి ఆదినారాయణ

మండల కేంద్రమైన బుక్కపట్నంలో బాబా ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెదేపా శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెదేపా జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ , మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను వివరించడం జరిగిందని సామకోటి ఆదినారాయణ తెలియజేశారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎస్‌సి సెల్ మహిళా అధ్యక్షురాలు యశోదరాయుడు, బూత్ కన్వీనర్ క్యాంటీన్ రవి, నాగరాజు, పీట్ల రమణ, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీక్షకు ఎస్‌టియు మద్దతు

పుట్టపర్తి, డిసెంబర్ 26, ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు రామ్మోహన్

పుట్టపర్తిలో జరుగుతున్న సమగ్రశిక్ష కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకు ఎస్‌టియు నాయకులు పూర్తీ మద్దతు ప్రకటించారు. జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ, సమానపనికి సమాన వేతనం, ఎస్ఎస్ఎ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయడం, ఉద్యోగస్తులందరికీ ఎంటిఎస్ వర్తింపజేయడం, పదవీవిరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచడం, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ కోనంకి చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, అదనపు ప్రధనా కార్యదర్శి ఆసిఫ్, ఎస్‌టియు సీనియర్ నాయకులు తిప్పన్న, ఎస్‌టియు మైనారిటీ నాయకులు ఖలీల్, తిప్పేస్వామి, ఇనాయతుల్లా, రవిచంద్ర, సంపత్, వెంగమనాయుడు, శ్రీనివాసులు, సుధాకర్, నరసింహ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పుట్టపర్తిటౌన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్నమున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని వాటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా మున్సిపల్ యూనియన్ ప్రధానకార్యదర్శి లక్ష్మినారాయణ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరవధిక దీక్షలో పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్,డ్రైనేజీ కార్మికులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఒక సంవత్సరం ఓపిక పట్టండి మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, నాలుగున్నరయేళ్ళ పాలన గడస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంక్రిమెంట్లు, రిటైరె మెంట్ బెనిఫిట్స్, గ్రావిటీ అన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరవధికంగా ఈ సమ్మె కొనసాగుతుందన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు అందజేయాలని, అవసరమైన యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్‌చేశారు. ఈ నిరసన దీక్షకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణసంఘీభావం తెలుపుతూ పాల్గొన్నారు. ఈ నిరసనకు టిడిపి సంపూర్ణ మద్దతు ఇస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రవాణరంగం జిల్లా కార్యదర్శి బాబా వలి, పట్టణ సిఐటియు కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు పెద్దన్న, రామయ్య, నరసింహులు, నాగరార్జున, ఇంజనీరింగ్ విభాగం నాయకులు గణేష్, రమేష్, రామదాసు, డ్రైనేజీ కార్మిక నాయకులు నాగరాజు, వెంకటేష్, పోతులయ్య, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై ప్రభుత్వం తీరు దుర్మార్గం


అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇచ్చిన ఆశ వర్కర్లు..

మడకశిర టౌన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలుపుకోవాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిపై ప్రభుత్వ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు సౌభాగ్య మహాలక్ష్మిలు విమర్శించారు. సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలతో కలిసి ప్లేట్లు గ్లాసులతో నిరసనే తెలిపారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు సౌభాగ్య, మహాలక్ష్మిలు మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా పిల్లలకు, బాలింతలు, గర్భవతులకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వఆడీ తాలూకా అధ్యక్షురాలు పద్మావతి, ఉషా, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమకు తగ్గ ఫలితం అందే వరకు పోరాటం


ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లపై డిప్యూటీ తహాశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మడకశిర టౌన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త : ఆశా వర్కర్లకు పనిభారాన్ని తగ్గించి కనీస వేతనాలు చెల్లించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని సిఐటియు జిల్లా కార్దయర్శి సౌభాగ్య మహాలక్ష్మిలు తెలిపారు. మంగళవారం ఆశా వర్కర్లు స్థానిక తహాశీల్దారు కార్యాలయంకి చేరుకొని అంగన్‌వాడీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అనంతరం ఆశావరర్కర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిప్యూటీ తహాశీల్దారు బాలాంజినేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సౌభాగ్య, మహాలక్ష్మిలు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఆశా కార్యకర్తలపై పని భారాన్ని పెంచిందని, రూ.10వేలు వేతనం ఇస్తున్నామన్న పేరుతో 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

05ATP26_05ATP26.qxd 27-12-2023 AM 12:00 Page 1



## ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ఓబుళదేవరచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త : స్థానిక సిపిఐ కాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 సంవత్సరం డిసెంబర్ 26న సిపిఐ పార్టీ ఆవిర్భవించిందన్నారు. భారత స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలకులతో వీరోచితంగా పోరాడి ఎందరో సిపిఐ నాయకులు ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారి నికి అనునిత్యం పోరాటం చేస్తున్న ఘన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం ప్రభుత్వాలు, పాలకులతో పోరా టం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చలపతినా యుడు, సుధాకర్, రామచంద్ర, గంగులప్ప, రత్నా బాయ్, రమణ, రవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన సిపిఐ శ్రేణులు

## మహాశక్తి పథకం మహిళలకు వరం

### - రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి జెరిపిటి అంజినప్ప

ఓబుళదేవరచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త : మహానాడు వేదికగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టి మనిమేనిఫెస్టోలోని మహాశక్తి పథకం మహిళలకు వరంలాంటిదని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్య దర్శి జెరిపిటి అంజినప్ప మహిళలకు వివరించారు. దుబురువారిపల్లి పంచా యితీ కుసుమవారిపల్లిలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెం టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి చంద్రబాబు అధికారంలో వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ పథకాల వల్ల ఎవరికి ఎటువంటి లబ్ది చేకూరుతుందో క్లుప్తంగా వివరించారు. అక్కచెల్లెమ్మలకు నెలకు రూ 1500, ఇంట్లో ఎంత మంది చదువుతున్నా అందరికి ఏడాదికి రూ 15 వేలు, ప్రతి రైతుకు సంవత్సరానికి రూ 20 వేలు, యువగళం నిధి ద్వారా యువతకు నిరుద్యోగ భృతి రూ 3 వేలు, ఇంటింటికి తాగునీటి కులాయి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ప్యూర్ టు రిచ్ పథకం, బిసి రక్షణ చట్టం తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మండలంలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు



క్రికెట్ క్రీడాకారులకు బ్యాట్లు అందజేస్తున్న ఎంపిపి రమణారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిల్డర్ పాలెం సుధాకర్

నల్లచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమూన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు మంగళ వారం మండల కేంద్రంలో ఎంపిడిఓ శకుంతల , ఎంపిపి రమణారెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ, బిల్డర్ పాలెం సుధాకర్, జెడ్పిహెచ్ పాఠశాల పిఈటి షఫీల ఆద్వర్యంలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంను గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించిన పోటీలలో పాల్గొన్న వారు సచివాలయంలో నమోదు చేసుకున్న ఆటగాళ్ళు వారి వారికి నిర్ణయించిన ఆటలను తమ సత్తా చూపాలని, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆటల్లో పాల్గొని ఆరోగ్యాన్ని పెంచుకోవాలని, ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి పైస్థాయి వరకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని మన ఆంధ్ర జట్టు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపిపి నారాయణస్వామి, మండల కన్వీనర్ హైదర్‌వలి, ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి, నల్లచెరువు 1 ఎంపిటిసి అల్లాపల్లి రామాంజినేయులు, లక్ష్మీదేవి, కె.పూలకుంట సర్పంచ్ యూసుఫ్, జెడ్పిహెచ్ పాఠశాల చైర్మెన్ పశువులేటి హరి, జెసిఎస కన్వీనర్ రాజశేఖర్, రఫీ, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్‌లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవ కార్యక్రమం

గాండ్లపెంట, డిసెంబర్ 26, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో ఈ రోజు ఉదయం 11 గంటలకు గాండ్లపెంట జడ్పీహెచ్ఎస్ స్కూల్ గ్రౌండ్ నందు ప్రారం భోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గాండ్లపెంట మండల వైసిపి కుటుంబ సభ్యులు, ఎంపిడిఓ, ఎంపిపి రెక్కమాను, గాండ్లపెంట, కటారుపల్లి పీడీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారదులు, క్రీడాకారులు ,గ్రామ ప్రజలు, పత్రిక విలేఖరులు అందరు పాల్గొనడం జరిగింది.



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం దృశ్యం

## ఘనంగా శ్రీకృష్ణుడికి పౌర్ణమి వేడుకలు

నల్లచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరం నందు మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఆలయ అధ్యక్షులు దాదెం శివారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి, సురేష్ స్వామిలు శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు ఉదయం పాలా భిషేకం, గంధం, కుంకుమ అర్చనలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించడం జరిగింది. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించకునేందుకు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఈ రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమానికి సహకరించి ఉభయదారులు కోటూరు రంగం ామిశెట్టి, తనకల్లు సాయిరాం స్కూల్ టీచర్ వేమనారాయణ భక్తులకు అన్నదాన కార్యక్రమానికి సహకరించారని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సూర్యనారాయణ, గోవిందరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



శ్రీకృష్ణుడి మూలవిరాట్

## యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్డిఓ

కదిరి, డిసెంబర్ 26 ప్రభాతవార్త

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను మంగ ళవారం ఆర్డిఓ వంశీకృష్ణతన కార్యాలయంలో ప్రారంభిం చా రు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ.. యుటిఎఫ్ ఆధ్వర్యంలో తమ వంతుగా దాతలసహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈకార్యక్రమంలో కోశాధి కారి శ్రీనివాసులు, కార్యదర్శి తాహిర్ వలి, వైవి.సుబ్బారెడ్డి, ఆజాంబాషా, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ సునీల్ కుమార్, కార్యవర్గ సభ్యులు భార్గవ, రమణనాయక్, మహబూబ్ బాషా, రవివర్ధన్‌రెడ్డి, నజీర్ బాషా, మనోహర్, ఖాజామొహిద్దీన్, షబ్బీర్, బాలాజీ నాయక్, బ్రహ్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం 26వేలు ప్రకటించాలి




నిరవదిక సమ్మె కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కదిరి, డిసెంబర్ 26 ప్రభాతవార్త

కనీస వేతనం 26వేలు ప్రక టించాలని, సుప్రీం కోర్టు తెలి పిన ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందజే యా లని, మున్సిపల్ వర్కర్స్ యూ నియన్ నాయకులు బాల కృష్ణ, జనార్ధన్‌లు తెలిపారు. మున్సి ప ల్ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలో ని మున్సి పల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరవదిక సమ్మె కార్యక్రం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, సూరి, చంద్రప్ప, చెన్నకృష్ణ, రాజు, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ 99వ ఆవిర్భావా దినోత్సవ వేడుకలు

నల్లచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రమణ ఆద్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలిసి స్థానిక బస్టాండ్ కూడలి నందు సిపిఐ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రమణ మాట్లాడుతూ 98 వసంతాలుపూర్తి చేసుకొని 99వ వసంతంలోకి అడుగుపెట్టిందని, 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ పురిటిలోనే ఎన్నో నిర్బంధాలు, నిషేదాలు, కుట్రలు, కేసులు ఎదుర్కొంది. దేశ సమైఖ్యత సమగ్రత, పరిరక్షణకు ఎందరో కామ్రేడ్‌లు తమ ప్రాణాలు త్యాగం చేశారనీ,వారందరి త్యాగ ఫలితమే కమ్యూనిష్టు పార్టీ ముందుకు దూసుకుపోతోందని, అన్ని వర్గాల ఆశాజ్యోతిగా నిలబడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీకి సమున్నతంగా పార్టీని జెండాను భవిష్యత్ తరాలకు అందించడానికి కృషి చేస్తున్న కామ్రేడ్ అందరి రెడ్ సెల్యూట్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదరి ్శ రెడ్డెప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చౌడప్పయాదవ్, రైతు సంఘం నాయకులు రామ య్య,మహిళ నాయకురాలు ఆదిలక్ష్మీ, లక్ష్మీదేవి బాయి, మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనరసమ్మ, టంగుటూరి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఐ పార్టీ నాయకులు

## తనకల్లులో అడుదాం ఆంధ్ర కార్యక్రమం

తనకల్లు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మల్లిరెడ్డిపల్లి గ్రామం సర్పంచ్ శైలజ ఆద్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ ఫైనల్‌ల్లో బాబేనాయక్ తండా జట్టుపై జి.యర్రగుంటపల్లి జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజయం సాధించిన జి.యర్రగుంట పల్లి జట్టును సర్పంచ్ భర్త పి. శివకుమార్ మరి యు యంపిటిసి శ్రీనివాసులు రూ. 5116 రూపాయలు బహుమతిగా ఇవ్వ డం జరిగింది. ఈ కార్యక్రమంలో పంఛాయతీ సెక్రటరీ చంద్రమో హన్‌నా య్రక్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్‌లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రికెట జట్టుకు బహు మ తి అందజేస్తున్న సర్పంచ్ భర్త శివశంకర్

## ఆడుదాం ఆంధ్ర క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన జెడ్‌పిటిసి

అమడగూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళ వారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మణుగూరు స్థానిక జెడ్‌పి టిసి కవిత శంకర్‌రెడ్డి క్రికెట్ టోర్నమెం ట్‌ను ప్రారంభించారు. టోర్న మెంట్‌లో గ్రామ పంచాయతీల్లో గెలుపొందిన వారికి నియోజకవర్గం టోర్నమెంట్‌లోకి పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరెడ్డి, ఎంపిడిఒ మునియప్ప, వైసిపి కన్వీనర్ సూరిరెడ్డి, ఎంఇఒ జిలాన్‌బాష, ఆర్ఐ ఈశ్వరయ్య, సర్పంచులు షబ్బీర్, సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, అశోక్, ఆయా సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌కు వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

అమడగూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

మండలంలోని పూలుకుం టపల్లి పంచాయతీ దూదురగు ట్టపల్లి ఎస్‌సి కాలనీలో గడపగడపకు కార్య క్రమంలో 15.80 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణాన్ని ప్రారం భించాలని గ్రామస్తులు స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతిపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గడపగడపకు కార్య క్రమంలో మంజూరైన సిసి రోడ్డు వెంటనే వేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారని బోడిగుండ్లపల్లి గ్రామ నాయకులు సిసి రోడ్డు పూర్తి చేస్తామని హామి ఇవ్వడంతో ఇంత వరకు పనులు చేపట్టలేదని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి ఆరోగ్య యోజన, వైఎస ఆర్ ఆరోగ్యశ్రీ సంరక్షణ పథకం కింద ఉచిత చికిత్సకార్డులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరస్వతి, కల్పన, శివశం కర, వెంకట రమణ, అరుణమ్మ, అమర్నాథ్, రాములప్ప, ఉత్తన్న, ఆదిల క్ష్మి, అరుణమ్మ, గంగాద్రి, పెద్ద నరసింహులు, బయమ్మ, రాధమ్మ, కృష్ణ మ్మ, దొడ్డప్ప, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం

పుట్లూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలో మంగళవారం సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మం డల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న కాన్పూర్ (ఉత్తర ప్రదేశ్)లో ఆవిష్కరించడం జరిగిందన్నారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి అనేక పోరాటాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా భారతదేశానికి సంపూర్ణ స్వతంత్ర్యం కోసం ఉద్యమించడం జరిగిందన్నారు. దేశ స్వతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజలందరికి సమాన రాజకీయ ఆర్థిక అవకాశం కోసం పోరాటాలు చేసింద న్నారు. అలాగే భూ సంస్కరణల అమలు కోసం పెద్దఎత్తున ఉద్యమించడం జరిగిందన్నారు. దళిత, గిరిజనుల సంక్షేమం కోసం వారికి ఆర్థిక, అభివృద్ధి అవకాశాలపై ఉద్యమించడం జరిగిందని ఆయన తెలియచేశారు. అనంతరం సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిపిఐ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

## భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పుట్లూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో వున్న శ్రీకాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమంలోని శ్రీకాశిరెడ్డినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీకాశిరెడ్డినాయనను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## 15వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



అంగన్‌వాడివర్కర్లు ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న దృశ్యం

పుట్లూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరింది. నిరసనలో భాగంగా అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్లు ఆకుల అలములు తిని నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమ్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యూనియన్ లీడర్ జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, మండల నాయకులు వెంకటచౌదరి, పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ్, అంగన్‌వాడిటీచర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

పుట్లూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశంలో యువతను క్రీడాకారులను మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించి వారి ప్రతిభను గురి ్తంచడం కోసం జగనన్న ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ స్థాయిలో జరుగుతున్న క్రీడలను మంగళవారం పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శింగనమల మార్కెట్‌యార్డుచైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతా ప్రారంభించారు. ప్రతి ఒక్క క్రీడాకారులు కూడా గొప్పగా క్రీడల్లో రాణించి పేరు తీసుకరావాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామిగాళ్ల ఓబులేసు, తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంఇఒ శ్రీదేవి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సరోజ, రామాంజనరెడ్డి, పిఇటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకాశిరెడ్డినాయన ఆరాధన



పూజల్లో పాల్గొన్న భక్తులు

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త

పట్టణంలోని జయనగర్‌కాలనీ 7వక్రాస్ శ్రీచౌడమ్మ దేవాలయం వద్ద వున్న శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో మంగళవారం శ్రీకాశిరెడ్డినాయన ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాశిరెడ్డినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీకాశిరెడ్డినాయనను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం హాజరైన వందలాది మంది భక్తులకు నిర్వాహకులు నాగిరెడ్డి గారి నాగిరెడ్డి, నాగిరెడ్డి అరుణలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా దాతలు వుంటే శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు నాగిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి



స్పెషల్ ఆఫీసర్‌కు పుష్పగుచ్చం అందచేస్తున్న దృశ్యం

యల్లనూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

యల్లనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యల్లనూరు గ్రామ సర్పంచు ఆర్.పెద్దఓబులమ్మ, ఎంపిటిసి తిమోతి, జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఫిరోజ్ ఖాన్, తహశీల్దార్ సుమతి, మండల ఎంఇఒ చంద్రశేఖర్, మండల విస్తరణ అధికారి విజయశేఖర్‌నాయుడు, పంచాయతీ సెక్రటరీ గీత, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయకుమారి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు. ఈ రోజు జరిగిన పోటీల్లో యల్లనూరు-2 గ్రామ సచివాలయం పరిధిలో బ్యాడ్మింటన్, యల్లనూరు-1 గ్రామ సచివాలయం పరిధిలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు.

## తాడిపత్రి పట్టణంలో ఎక్కడ పనులు అక్కడే



మాట్లాడుతున్న జె.సి

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయని మున్సిపల్‌చైర్మెన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రోడ్డను తవ్వి వదిలేశారన్నారు. దీనిని కొందరు వీడియో పెట్టి మరీ మేము ఏదో చేస్తామంటూ గొప్పలు చెప్పారన్నారు. కానీ ఇప్పుడు గాంధీనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద గతంలో తవ్విన రోడ్డును ఆయన పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని జె.సి అధికారులను ఆదేశించారు.

## పట్టణంలో పర్యటించిన జె.సి అశ్మిత్‌రెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త

పట్టణంలోని కృష్ణాపురం 10వరోడ్డు, టైలర్స్‌కాలనీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు, వారి స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అనుచరులు, అభిమానులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవత ఊరేగింపు

నంబులపూలకుంట, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

ఎల్లమ్మ దేవతను మండల పరిధిలోని గ్రామాలలో ఆలయ కమిటీ సభ్యు ల ఆధ్వర్యంలో మంగళవారం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అం దులో భాగంగా అమ్మవారికి గ్రామాలలోని ప్రతి బజారులో ఊరేగించగా భక్తు లు అమ్మవారికి ఆశీస్సులు తీసుకో వడం జరిగింది. అనంతరం భక్తులు అమ్మవారికి ఊరేగింపుతో గండిమడుగుకు తీసుకెళ్ళి వారి మొక్కుడులు తీర్చుకున్నారు.



ఎల్లమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు




**BIG SAVINGS** ALTO K10 ₹64 000* S-PRESSO ₹59 000* SWIFT ₹54 000* WAGONR ₹64 000* CELERIO ₹64 000*

SCAN TO CHAT WITH US

ALTO K10 S-PRESSO SWIFT WAGONR CELERIO

*E-BOOK TODAY AT WWW.MARUTISUZUKI.COM OR VISIT YOUR NEAREST MARUTI SUZUKI DEALERSHIP.*

*Black glass on the vehicle is due to lighting effect.*

**MARUTI SUZUKI AUTHORISED DEALERS: RAYALSEEMA: BHARGAVI:** (TIRUPATI) CALL: 9248709123. **SRI DURGA:** (ANANTHAPUR) CALL: 9573488873. **MSA:** (KURNOOL) CALL: 9100907770. **VISHNU:** (TIRUPATI) CALL: 8008080852. **E-OUTLET: BHARGAVI:** (CHITTOOR) CALL: 9248709123, (MADANAPALLY) CALL: 9248709123. **MSA:** (CUDDAPAH) CALL: 9848876006, (NANDYAL) CALL: 6309949735. **SRI DURGA:** (HINDUPUR) CALL: 9573688815.

*Applicable Terms and conditions available at Maruti Suzuki Arena authorized dealer. Maruti Suzuki reserves the right to withdraw offers at any point in time without any advance notice. All offers are applicable till 31ST December 2023 or till stocks last. Offers applicable on selected models and selected cities. Car models and accessories shown may vary from the actual product. Images used are for illustration purpose only. Offers shown above include Consumer Offer and Exchange Bonus. Prices mentioned are tentative and might vary basis applicable offers and registration cost. ^All loans and schemes are at the sole discretion of the Finance Partner.


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.